🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
☎ : 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు


సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్


సంపుటి : 1 | సంచిక : 46 | 30-08-2021 | పుటలు : 4




ధ్యాన్ చంద్ (1905, ఆగస్టు 29 - 1979, డిసెంబరు 3) ఒక సుప్రసిద్ధ భారతీయ హాకీ ఆటగాడు. హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకడు.గోల్స్ చేయడంలో మంచి ప్రతిభ కనబరిచేవాడు. భారతదేశానికి హాకీలో స్వర్ణయుగంగా పరిగణించదగిన 1928, 1932, 1936 ఒలంపిక్స్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి పెట్టాడు.ధ్యాన్ చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని క్రీడా దినోత్సవంగా జరుపుకోవటం సంతోషించదగిన విషయం.క్రీడా లోకానికి శుభాకాంక్షలు!!

**క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు!!**





**ఆగస్టు 30 శ్రీకృష్ణ జన్మాష్టమి**

## “కృష్ణం వందే జగద్గురుమ్”

యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు !
యుక్త స్వప్నావ బోధస్య యోగో భవతి దుఃఖహా!!

ఆహారంలో, విహారంలో, విద్యుక్త ధర్మంలో(డ్యూటీ),కార్యకలాపాలలో, చివరికి కలలో కూడా పద్ధతిగా,యోగ్యమైన విధంగా,స్వచ్ఛంగా ప్రవర్తించేవారికి తమ విచారాన్ని నిర్మూలించుకునే ఆత్మశక్తి(ధ్యానయోగం)కలుగుతుంది. ౨- శ్రీకృష్ణ పరమాత్మ

**శుభాకాంక్షలతో.... నన్నయవాణి**

# తెలుగు భాషాభివృద్ధికి పాటుపడదాం

## సంస్కృతం, తెలుగు భాషలు తల్లిబిడ్డల వంటివి
## తెలుగు, సంస్కృత అకాడమి చైర్ పర్సన్ లక్ష్మీపార్వతి




సమావేశంలో మాట్లాడుతున్న డా.నందమూరి లక్ష్మీపార్వతి

**27.08.21 (మీడియాసెల్)** తెలుగు భాషాభివృద్ధికి అకాడమి కృషి చేస్తుందని, సమష్టి కృషితో మాతృభాషను పరిరక్షించుకుందామని తెలుగు, సంస్కృత అకాడమి చైర్ పర్సన్ లక్ష్మీపార్వతిఅన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం భాషా చైతన్య సదస్సును నిర్వహించారు.దీనికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయానికి విచ్చేసిన తెలుగు, సంస్కృత అకాడమి చైర్ పర్సన్డాక్టర్ నందనమూరి లక్ష్మీపార్వతి నన్నయ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు పుష్పగుచ్ఛాని అందజేసి మార్యదపూర్వకంగా స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయ సెమినార్ హాల్ లో నిర్వహించిన భాషా చైతన్య సదస్సుకు హాజరై జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీపార్వతి మాట్లాడుతూ స్వర్గీయనందమూరి తారక రామారావు, దివంగతనేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి తెలుగుభాషాభివృద్ధికి, విద్యాభివృద్ధికిఎంతో కృషి చేసారని అన్నారు. ఈ క్రమంలో ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డితెలుగు, సంస్కృత అకాడమి కి ప్రత్యేక ప్రాధన్యతనిచ్చి విద్య, భాష, సాహిత్య అభివృద్ధికికృషి చేస్తున్నారని చెప్పారు. తిరుపతిలో తెలుగు, సంస్కృత అకాడమి శంకుస్థాపన త్వరలో జరుగుతుందని అకాడమితో పాటు భాష అధ్యాయణ సంస్థను ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.ఇంటర్ పుస్తకాలను అకాడమి నుండి ప్రచురించామని తరువాత నుండి డిగ్రీ పుస్తకాలను ప్రచురిస్తామన్నారు.భాష పరిరక్షణలో భాగంగా అకాడమి తరుపున భాష చైతన్య సదస్సులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామనిచెప్పారు. దీనిలో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వీసీ జగన్నాథరావు పర్యావేక్షణలోఘనంగా భాష చైతన్య సదస్సును నిర్వహించారని తెలిపారు. భాష, సంస్కృతి, సాహిత్యాలకు పుట్టినిల్లురాజమహేంద్రవరమని ఎన్నో అమూల్యమైన సాహిత్య సంపద గౌతమీ గ్రంథాలయంలో నిక్షిప్తమై ఉందన్నారు.రాజమహేంద్రవరం బొమ్మూరు ప్రాంతంలోని తెలుగు విశ్వవిద్యాలయ పిఠానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకుతనవంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. సంస్కృతం, తెలుగు భాషలు తల్లిబిడ్డల వంటివని ఒకదానితోఒకటి మిలితమై ఉంటాయని అన్నారు. తల్లిదండ్రులు ఇండ్లల్లో మాతృభాషలోని పిల్లలతో మాట్లాడటం,మాట్లాడించడం చిన్నతనం నుండి అలావాటు చేయాలని తద్వారా మాతృభాషలోని మాధుర్యం పిల్లలకుఅర్ధమవుతుందని తెలిపారు. భాషాభివృద్ధికి అకాడమి కృషి చేస్తుందని, సమష్టి సహకారంతో తెలుగుభాషను పరిరక్షించుకుందామని సూచించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ గోదావరిజిల్లాల్లోని భాషాభిమానులతో చక్కని సదస్సు జరగడం, దానికి నన్నయ విశ్వవిద్యాలయం వేదికకావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తెలుగు, సంస్కృత భాషల మధ్య ఉన్న సంబంధాలను తెలియజేస్తూ,భాషలలోని ఔనత్యాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమికి, ఆదికవి నన్నయవిశ్వవిద్యాలయం పూర్తి సహాయ సహకారాలను అందిస్తుందని తెలియజేసారు. విద్య, భాష, సాహిత్యాభివృద్ధికి సంబంధించి అకాడమితో కలిసి ప్రోజెక్టులు చేయడానికి విశ్వవిద్యాలయం సిద్ధంగా ఉందన్నారు. విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ సమర్ధవతంగా నడపబడుతుందని, అకాడమితో కలిసి సంస్కృత భాషకుసంబంధించి విశ్వవిద్యాలయంలో డిప్లమా కోర్సును ఏర్పాటు చేయవచ్చునని సూచించారు. దీనిపైలక్ష్మీపార్వతి సానుకులంగా స్పందించి సంస్కృతం నుండి భారతాన్ని తెలుగులోనికి అనువదించినఆదికవి నన్నయ పేరుతో ఏర్పడిన విశ్వవిద్యాలయంలో తెలుగు, సంస్కృతి భాషలు ఉండటం మంచి పరిణామమనిఅన్నారు. భాషాభ్రిద్ధికి వీసీ జగన్నాథరావు సూచనలను హార్షనీయమని, అకాడమి తరుపున వాటినిపరిశీలించి ప్రణాళికబద్ధంగా ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఆంధ్ర సారస్వత అధ్యక్షులుజక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ సంస్కృతిక రాజదానిగా రాజమహేంద్రవరాన్ని మరింత అభివృద్ధిచేయాలని కోరారు. వక్తలు గా పూర్వ ప్రాచార్యులు, సంస్కత కళాశాల కొవ్వూరు డా.దోర్బల ప్రభాకరశర్మ,తెలుగు, సంస్కత అకాడమి పాలకమండలి సభ్యులు కళాగౌతమి వ్యవస్థాపక అధ్యక్షులు డా.బులుసు వెంకట సత్యనారాయణమూర్తి, విశ్రాంత స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.ఆర్.పృధ్వీ, ఆస్వాదన సాహితీ సమితి సమన్వయకర్త కె.గౌరినాయుడు,చారిత్రక పరిశోధకులు కుర్రా జితేంద్రబాబు, వీరేశలింగం కళాశాల తెలుగుశాఖాధిపతి డా.పి.బి.వి. సంజీవరావు తెలుగు, సంస్కృత భాషలకు సంబంధించి పలు అంశాలను వివరించారు.అనంతరం విశ్వవిద్యాలయం తరుపున అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఎస్.ఆర్.పృధ్వీ రచించిన కిర్మీరం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు ఆచార్య టి.అశోక్,తెలుగు శాఖ అధ్యాపకులు డా.తరపట్ల సత్యనారాయణ, డా.తలారివాసు, డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, డా.డి.లక్ష్మీనరసమ్మ, ఈసీ మెంబర్లు ఆచార్య కొట్టి శ్రీరమేశ్, డా.బి.జగన్మోనరెడ్డి, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, భాషాభిమానులు తదితరులు పాల్గొన్నారు.



డా.నందమూరి లక్ష్మీపార్వతిని సన్మానిస్తున్న వీసీ, అధికారులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న లక్ష్మీపార్వతి, వీసీ, అధికారులు

## సంపాదకీయం




# తెలుగు తోట

క్షీరాబ్ధి కన్యక కిలకిల నవ్విన నవ్వు తెలుగు భాష. నన్నయ భట్టారకుని దగ్గర నుంచి నవ యువకవి వరకు ఆత్మశక్తిని చేకూర్చే అమృత భాష తెలుగు. రాతి నేలను దున్ని జాతి ముంగిట ధాన్య రాసులు వర్షించిన రైతుభాష మన తెలుగు. గొడ్లకాపరి కూడా గొంతెత్తి కోయిలై పద్యాన్ని ఆలపించే హృద్యమైనది తెలుగు. నిండు చెరువులో స్వచ్ఛమైన నీరు తెలుగుభాష. పండి ఒరిగిన పంట చేను పకపక నవ్వినట్లు ఉండే భాష మన తెలుగు. చెట్టుచుట్టూ తిరిగే పిట్ట తెలుగు. తేనె పనసలతోట తెలుగు.'చదువుల తల్లికి సుమధుర శైలికి పుట్టినిల్లు తెలుగు! అల్లసాని అల్లికల జిగిబిగిని అమృతధార తెలుగు! చక్కెర కలిపిన తియ్యని కమ్మని తోడు పెరుగు తెలుగు!' అన్నారు జొన్నవిత్తుల కవిగారు.

తెలుగు భాషలోని దివ్య నాదాన్ని వినటం, తెలుగు లిపిలోని దేవతాకృతిని చూడగలగటం ఎన్నో జన్మల తపఃఫలం. తెలుగువాడిగానే పరిపూర్ణంగా జీవించమన్నారు తెనుగులెంక తుమ్మల. 'నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అన్నారు తెలుగుకవి తిలక్.

ఏ శుభముహూర్తాన నన్నయగారు శ్రీవాణీ గిరిజా: అంటూ తెలుగు భారత రచనకు శ్రీకారం చుట్టారో కానీ తెలుగుభాష ఇంపుసొంపులనూ ఒయ్యారాన్నీ,సోయగాన్నీ తనలో పొదువుకుంది.

అందునా తెలుగు అక్షరానికి గొప్ప సత్తా ఉంది. అక్షరం అన్నం పెడుతుంది. వెన్నుతట్టి కొండంత ధైర్యాన్నిచ్చి ఓదారుస్తుంది. మనుగడకు దారి చూపించి వెలుగులోకి నడిపిస్తుంది. 'ఎంత చక్కనిదోయి ఈ తెలుగు - ఎంత పరిమళమోయి ఈ తోటపూలు!' అన్నారు కందుకూరి రామభద్రరావు గారు.

అవును - ఈ తెలుగుతోట గొప్ప నందనవనం. ఇందులో అపురూపమైన జానపదాలు, ఇతిహాసాలు, పురాణాలు, సంకీర్తనలు, భక్తిమార్గాలు, ప్రబంధాలు, కావ్యాలు, గీతాలు... ఎన్నో ప్రక్రియలు విరిశాయి. కురిశాయి. అద్భుతమైన పరిమళం అనునిత్యం సురభిళమవుతూనే ఉంది. 'ఒక్క సంగీతమేదో పాడునట్లు భాషించునపుడు వినిపించు భాష' అన్నారు విశ్వనాథ. ఎందుకంటే మనది ఋషుల ఒరవడి! మమతల గుడి! అంతెందుకు- అమ్మఒడి!! లేకపోతే మహాకవి శ్రీశ్రీ 'అందని అందానివిగా,నీకై బ్రతుకే ఒక తపమై..' తెలుగు కవిత కోసం నిరీక్షిస్తున్నానన్నారు. నిరంతరం ఆరాధించారు. నిత్యం కవిత్వాన్ని ఉపాసించారు.

భాషలోని అందాన్ని ఆస్వాదించటం, ప్రయోగించటం ఎంత అవసరమో, తెలుగువారు తెలుగుభాషను,సాహిత్యాన్ని తమ తర్వాత తరాలకు అందించడమూ అంతే అవసరం. అజంత అజరామర భాషకు అచ్చమైన వారసులుగా నేటి 'అమ్మ - నాన్న' లు తమ పిల్లలకు తెలుగుపట్ల మమకారాన్ని కలిగిస్తారని తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నన్నయవాణి ఆకాంక్షిస్తోంది.




## మంచి మాట

చేయక తప్పని పనిలో కూడా కావాలని ఆలస్యం చేస్తే కాలం ఆ పనిని నిస్సారంగా మార్చివేస్తుంది.

- పంచతంత్రం



ఆగస్టు 26...

మదర్ థెరిస్సా జన్మదినం

## విశ్వమాత!

కులం వద్దు,మతం వద్దు
సమానత్వమే మన సరిహద్దు అంటూ...
నిజజీవితంలో ఆచరించి చూపిన
ఆదర్శ భారతరత్నం మదర్ థేరిస్సా!
దిక్కులేని అనాధలను
దివ్యాంగులను
అనాథ వృద్ధులను
అక్కున చేర్చుకుని
వారి జీవితాలకు భరోసాను కల్పించిన
మానవతావాది మదర్ థేరిస్సా!
మానవసేవే మాధవసేవ
ప్రార్థించే పెదవుల కన్నా
సాయంచేసే చేతులు మిన్న అంటూ
కష్టజీవుల కడగండ్లను కడతేర్చిన
కరుణామయి మదర్ థేరిస్సా!
అడగకుండానే అవసరాలను తెలుసుకుని
అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపిన
విశ్వమాత మదర్ థేరిస్సా!

- ఆళ్ల నాగేశ్వరరావు, తెనాలి

# మదర్ థెరిసా జీవితం ఆదర్శనీయం


**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**


మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**26.08.21 (మీడియాసెల్)** మానవత్వానికి సేవా దృక్పథానికి మరో రూపం మదర్ థెరిసా అని, మదర్ థెరిసా జీవితం అందరికీ ఆదర్శనీయమని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయం ఈసీ హాల్ లో మదర్ థెరిసా జయంతి వేడుకలను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరై వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మానవత్వం, సేవాదృక్పథాలతో తమ జీవితాన్ని సమాజానికి అంకితం చేసి ప్రపంచ ప్రేమస్వరూపినిగా మారిన మాతృమూర్తి మదర్ థెరిసా అని కొనియాడారు. తాను ఆదర్శంగా తీసుకొనే మహనీయులలో మదర్ థెరిసా ప్రథములని చెప్పారు. ప్రస్తుత భయానక దినాలలో జీవితం చాలా స్వల్పంగా మారిందని జీవిత సత్యాలను తెలుసుకొని తోటివారికి సహకారులుగా ఉండాలని అన్నారు. పొరుగువారిని ప్రేమించి మనకు కలిగిన దానిలో కొంచెం ఇతరులకు పంచాలని చెప్పారు. దయాహృదయాన్ని కలిగి జీవించినంత కాలం మానవత్వతో మదర్ థెరిసాలా ఉన్నత ఆలోచనలతో మెలగాలని తెలిపారు. ప్రతీ మనిషికి మరణం ఉంటుందని కానీ మానవత్వంతో జీవించిన మదర్ థెరిసా వంటి మహనీయులు చిరకాలం జనహృదయాల్లో జీవించి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డీన్స్ ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.పి.వెంకటేశ్వరరావు, డా.ఎన్.ఉదయంభాస్కర్, డా.ఎన్.నూకరత్నం, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి, సి.ఈ.ఎస్.లింగారెడ్డి, ఎఫ్.ఓ. సత్యనారాయణ, డా.ఎం.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఖనిజాన్వేషణలో లోతైన పరిశోధనలు జరగాలి

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**26.08.21 (మీడియాసెల్)** భారతదేశ ఆర్థికాభివృద్ధిలో ఖనిజ సంపద ఎంతో కీలక పాత్రను పోషిస్తుందని,ఖనిజాన్వేషణలో భావి పరిశోధకులు లోతైన పరిశోధనలు జరపాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. భారత ప్రభుత్వ - జియోలజికల్ సర్వే ఆఫ్ఇండియా ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ వారు "ఖనిజ అన్వేషణ శాస్త్రీయ పద్ధతులు" అంశంపై సోమవారం ఈ-లెక్చర్ సెషన్స్ ను నిర్వహించారు. భారతదేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి ఐ.ఐ.టి, ఎన్.ఐ.టి కి చెందిన నిష్ణాతులు, విద్యావేత్తలు, భూవిజ్ఞానశాస్త్ర పరిశోధకులు,విద్యార్థులు సుమారు 800 మంది ఈ-లెక్చర్ లో పాల్గొన్నారు. జియాలజీ విభాగంలో అపార అనుభవంకలిగిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా హాజరై ఉపన్యసించారు. వీసీ మాట్లాడుతూ భారతదేశ ఆర్థికాభివృద్ధిలో ఖనిజసంపదకు ఎంతో ప్రాధాన్యం ఉందని అన్నారు. ఖనిజాన్వేషణలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కోవలసివస్తుందని ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ,శాస్త్రీయ మెలకువలను పాటిస్తూ ఖనిజ అన్వేషణలో మెరుగైన ఫలితాలను సాధించవచ్చునని చెప్పారు. సహజ వనరులను సమగ్రంగా ఉపయోగించుకునే దేశాలు అభివృద్ధిచెందిన దేశాల జాబితాలోకి చేరుతాయని, కాబట్టి భావి పరిశోధకులు నూతన వనరుల అన్వేషణకు పాటుపడాలన్నారు. ఖనిజ వనరుల అన్వేషణపై భూవిజ్ఞానశాస్త్రాల ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు,విద్యార్థులు లోతైన పరిశోధనలు చేయాలని చెప్పారు. భూవిజ్ఞానవేత్తలు నేరుగా దేశాభివృద్ధికి పాటుపడే గొప్ప అవకాశాన్ని కలిగినవారు ఉన్నారని,కాబట్టి బాధ్యతాయుతంగా ఖనిజ అన్వేషణ శాస్త్రీయ పద్ధతులు,మెలకువలపై పట్టుసాధించాలని సూచించారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో దక్షిణ ప్రాంతంలోని ప్రాంతీయ శిక్షణ విభాగం, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ లు ఎన్నోవిలువైన శిక్షణ తరగతలను నిర్వహించాయని నిర్వహకులను అభినందించారు. జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియా భారత స్వాతంత్ర్యానికి పూర్వం నుండి ఉన్న విభాగమని భారతదేశ అభివృద్ధిలో కీలకపాత్రను పోషిస్తుందని తెలియజేశారు. భూవిజ్ఞాన శాస్త్ర విభాగాలకు ఎంతో భవిష్యత్ ఉందని భావి విద్యార్థులు భూవిజ్ఞాన శాస్త్రంపై మక్కువ పెంచుకొని ఆసక్తికర పరిశోధనలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్.టి.డి.-ఎస్.ఆర్ డైరెక్టర్ ఆర్.విజయ్ కుమార్, డి.డి.జి.అండ్ ఎం-వి, జి.ఎస్.ఐ.టి.ఐ హెడ్ సిహెచ్. వెంకటేశ్వరరావు, జి.ఎస్.ఐ.టి.ఐ ప్లానింగ్ అండ్ప్రోగ్రామింగ్ డైరెక్టర్ డా.బిభాస్ సేన్ మరియు నన్నయ విశ్వవిద్యాలయం, ఆర్ట్స్,సైన్స్ కళాశాల విభాగాచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




ప్రతిభా వాణి

## గిడుగు వెంకట రామమూర్తి

**(ఆగష్టు 29, 1863 - జనవరి 22, 1940)**



తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు, గిడుగు వెంకట రామమూర్తి. గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియజెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు. బహు భాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘ సంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారిక భాషను గ్రంథరచనకు స్వీకరింపజేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చతెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారికభాషలో సాగి, అందరికీ అందు బాటులోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్యసృష్టి, సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. గిడుగు రామ్మూర్తి జయంతి ఆగష్టు 29 ని మనం "తెలుగు భాషా దినోత్సవం"గా జరుపుకుంటున్నాం.

1907లో J. A. Yates అనే ఇంగ్లీషుదొర ఉత్తర కోస్తా జిల్లాలకు స్కూళ్ళ ఇన్స్పెక్టర్‌గా వచ్చాడు. చిన్న తరగతుల్లో తెలుగు పండితులు పాఠాలు చెప్పే పద్ధతి ఆ దొరకు అర్థం కాలేదు. ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఎందుకు తేడాలు ఉన్నాయి అన్నది అతని ముఖ్య సమస్య. అంతకు ముందు తమిళదేశం లోనూ అదే సమస్య అతనిని వేధించింది. విశాఖపట్నంలో A.V.N. College ప్రిన్సిపాలుగా ఉన్న పి.టి. శ్రీనివాస అయ్యంగారిని అడిగితే ఆయన గురజాడ, గిడుగులు దీనికి సమాధానం చెబుతారని అన్నాడు. ఆ విధంగా గిడుగు జీవిత ఉత్తరార్ధంలో ఈ విషయాన్ని గురించి గాఢంగా ఆలోచించి తెలుగు విద్యా విధానంలో అన్యాయం జరుగుతున్నదని గుర్తించాడు. గురజాడ, గిడుగులు, శ్రీనివాస అయ్యంగారు, యేట్సు ౦ ఈ నలుగురి ఆలోచనల వల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైంది. అప్పటికే ఇంగ్లీషులో భాషాశాస్త్ర గ్రంథాలు చదివిన గిడుగు ప్రతి యేడూ జరిగే అధ్యాపక సదస్సుల్లో జీవద్భాష ప్రాధాన్యత గురించి ఉపన్యాసాలిచ్చాడు.

1906 నుండి 1940 వరకు గిడుగు రామమూర్తి కృషి అంతా తెలుగు భాషా సేవకే. యేట్స్ ప్రోత్సాహంతో శిష్టజన వ్యావహారిక తెలుగు భాషను గ్రంథరచనకు గ్రాహ్యమైందిగా చేయడానికి అత్యంత కృషి చేసి కృతకృత్యుడయ్యాడు. వీరేశలింగం పంతులు ఊతం కూడా ఇతనికి లభించింది. 1919–20 ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాసపత్రిక నడిపాడు. వ్యావహారిక భాషను ప్రతిఘటించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో (1925, తణుకులో) నాలుగు గంటలపాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింపజేసాడు "గిడుగు". సాహితీ సమితి, నవ్యసాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బలపరచాయి.

1912–13లో స్కూలు ఫైనల్‌లో వ్యాసరచన కావ్యభాషలో గాని ఆధునికభాషలో గాని వ్రాయవచ్చునని స్కూలు ఫైనల్ బోర్డు కార్యదర్శి ఒక జీ.ఓ. ఇచ్చాడు. ఆధునికభాషకు లక్ష్యంగా బ్రౌన్ తెలుగు రీడర్ ను, ఏనుగుల వీరాస్వామయ్య కాశీయాత్ర చరిత్రను ఉదహరించాడు. ఈ మార్పుల వల్ల తెలుగు సాహిత్యానికి అపకారం జరుగుతుందని పండితుల్లో అలజడి బయలుదేరింది. మద్రాసులో జయంతి రామయ్య పంతులు అధ్యక్షతన "ఆంధ్ర సాహిత్య పరిషత్తు" ఏర్పడ్డది. వావిలికొలను సుబ్బారావు, వేదం వేంకట రాయ శాస్త్రి లాంటి పండితులు జయంతి రామయ్య వాదాన్ని బలపరిచారు. దేశం అంతటా సభలు పెట్టి వ్యాసరచన పరీక్షలో ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛను ఉపసంహరిం చాలని పెద్ద ఎత్తున ఉద్యమం లేవదీసారు.

స్కూలు కాలేజీ పుస్తకాల్లో గ్రాంథికభాషే పాతుకుపోయిందిబీ కొన్నిటిలో వీరేశలింగం ప్రతిపాదించిన సరళ గ్రాంథికం కూడా వచ్చింది. గిడుగు రామమూర్తి ఊరూరా ఉపన్యాసాలిస్తూ గ్రాంథికంలో ఏ రచయితా నిర్దుష్టంగా వ్రాయలేడని నిరూపించాడు. 1919 లో గిడుగు "తెలుగు" అనే మాసపత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించాడు. కాని ఆ పత్రిక ఒక ఏడాది మాత్రమే నడిచింది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి, వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వజల చినసీతారామస్వామి శాస్త్రి మొదలైన కవులు, పండితులు వ్యావహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1919 ఫిబ్రవరి 28 న రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షుడుగా, గిడుగు కార్యదర్శిగా "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం" స్థాపించారు. 1933 లో గిడుగు రామమూర్తి సప్తతి మహోత్సవం ఆయన అభిమానులు, శిష్యులు రాజమహేంద్రవరంలో బ్రహ్మాండంగా జరిపారు. తెలికచెర్ల వెంకటరత్నం సంపాదకుడుగా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 46 పరిశోధకవ్యాసాలతో Miscellany of Essays (వ్యాస సంగ్రహం) అనే ఉద్గ్రంథాన్ని ఆయనకు సమర్పించారు. 1924 లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఆధికారికంగా వ్యావహారిక భాషా నిషేధాన్ని ఎత్తివేసింది. 1936 లో నవ్యసాహిత్య పరిషత్తు అనే సంస్థను ఆధునికులు స్థాపించి సృజనాత్మకరచనల్లో శిష్టవ్యావహారికాన్ని ప్రోత్సహించే "ప్రతిభ" అనే సాహిత్యపత్రికను ప్రచురించారు. 1937లో తాపీ ధర్మారావు సంపాదకుడుగా "జనవాణి" అనే పత్రిక కేవలం ఆధునిక ప్రమాణ భాషలోనే వార్తలు, సంపాదకీయాలు వ్రాయటం మొదలుపెట్టింది.

## భాషా చైతన్యం....



నమస్కారం!

"ప్రతిష్ఠే ద్వే సంస్కృతం సంస్కృతి స్తథా"!

మన పవిత్ర భారతదేశం ప్రతిష్ఠకి రెండే
ప్రధానమైనవి
ఒకటి– సంస్కృత భాష
మరొకటి– సంస్కృతి.
సంస్కృత భాషని దేవభాష అన్నారు.
Sanskrit is the language of Angels!
ఇంక మన సంస్కృతి ఒక కల్పతరువు!
సంస్కృత భాషా సాహిత్యా
లలోనే మన దేశ సంస్కృతి అంతా నిక్షిప్తమై
ఉంది.
అదొక కామధేనువు!
"జనని సంస్కృతంబు సకలభాషలకు!"–అన్నది
మన విశ్వాసం.
భారతీయభాషలన్నింటికి
మాతృకు– సంస్కృతమే.
సమయం,కాలం,
అన్నం,భోజనం,
విద్య, జ్ఞానం
ఇలా ఎన్నెన్నో మనం రోజూ
వాడేపదాలు అన్నీసంస్కృతమే.
మన ఆచారాలు, నియమాలు,
అన్నీ సంస్కృతంలోనే ఉన్నాయి.
అటువంటిది మృతభాష గా (dead language) ముద్రపడిపోయింది. ఇప్పుడిప్పుడు
ఈ మహత్తర
భాష గొప్పతనం మనం గుర్తించి
దీని పునర్వికాసం కోసం ఆలోచన మొదలైంది.
ఇందుకు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం
మన గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్
రెడ్డి గారు తీసుకొంటున్న
చర్యలన్నీ దేశభాషలకి ప్రాణం
పోయటమే!
సంస్కృతంతో సంపర్కం
లేకపోతే మనభాష నీరసించి
పోతుంది.
నూటికి 75% పదాలు,వ్యాకరణం,
భావాలు మనకి సంస్కృతం అందించింది.
మనభాషకి నవరసపోషణశక్తిని
ఇచ్చినది– సంస్కృతమే!
సంస్కృతానికిగల వ్యాకరణ సంస్కారం గొప్పది.
ఆధునిక కాలంలో ఆంగ్లభాష ఆవశ్యకత
ఎక్కువగా ఉన్నది.
మనం ఏ భాషని నిరసించవలసిన పనిలేదు
తెలుగు భాష యొక్క అమోఘమైన లక్షణం –
మన భాష "సంశ్లిష్టభాష!"
ఏ భాషా పదాన్నైనా మనలో కలుపుగోగల
కలుపుగోలుతనం మన భాషకి ఉంది.
మన భాష తక్కువదేమీకాదు.
ప్రాచీనహోదాగల భాష.
దేశభాషలందు తెలుగులెస్స! అని శ్రీనాథుడు,
శ్రీకృష్ణ దేవరాయలు ప్రశంసించారు.
సకలపురాణాలు మనభాషలోకి తెచ్చుకున్నాం.
అందువలన మన తెలుగు సుసంపన్నమైంది.
సంస్కృతంలో ఉన్న మనమహా
భారతంవంటి గొప్పగ్రంథాల్ని
మొదట తెనిగించిన మహాకవి నన్నయ గారి
పేరుతో మనం చక్కని విశ్వవిద్యాలయం
ఏర్పాటు చేసుకున్నాం. ఋషి వంటి నన్నయ
రెండవ వాల్మీకి అన్నారు విశ్వనాథ
సత్యనారాయణ గారు.నన్నయ గారు తెలుగు
భారతాన్ని సంస్కృత శ్లోకంతోనే శ్రీకారం
చుట్టారు.

ఏనాటికీ చెక్కుచెదరని విధంగా మన పౌరాణిక
పాత్రలకి ప్రాణ ప్రతిష్ఠ చేసిన ఆంధ్రుల
అందాలనటులు శ్రీ నందమూరి
తారకరామారావుగారు–
అపర శ్రీకృష్ణ దేవరాయలు
అనటం ఆంధ్రులకి ఆమోద
యోగ్యమైనవిషయమే!

అటువంటి తల్లీబిడ్డల వంటి
సంస్కృత, తెలుగు భాషాల్ని కలిపి నేటి
ప్రభుత్వం ఒక అకాడమీని
ఏర్పాటు చేయటం సంతోషించదగిన విషయం.
ఇటువంటి జంటభాషలలో నేర్పరి
అయిన శ్రీమతి లక్ష్మీపార్వతి గారి
వంటి విదుషీమణిని ఆ సంస్థ బాధ్యతను
అప్పగించడం
ప్రశంసనీయమైన విషయం.
వీరి హయాంలో మన భాషా సాహిత్యాలు
మూడుపూవులారుకాయలుగా వికసించాలని
ఆశిస్తున్నాను.
శ్రీమతి లక్ష్మీపార్వతి గారికి తక్కిన అకాడెమీ
సభ్యులకి,తెలుగు–సంస్కృత భాషా పండితులకు
శుభాకాంక్షలు అందజేస్తున్నాను.
ఆగస్టు 29 గిడుగు రామ్మూర్తి పంతులు గారి
జన్మదినం సందర్భంగా తెలుగు భాషా
దినోత్సవ శుభాకాంక్షల్ని తెలియజేస్తున్నాను.

"ఆంధ్రత్వం ఆంధ్రభాషాచ నాల్పస్య తపసః
ఫలమ్!"
తెలుగు వారిగా మనం జన్మించటం,తెలుగును
మాతృ భాషగా కలిగి ఉండటం పూర్వ జన్మ
సుకృతమే....అని భావిస్తున్నాను.
ధన్యవాదాలతో....

– ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి,
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.

## ఘనంగా క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాం

**28.08.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విసి ఆచార్య మొక్కా జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ సహకారంతో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. బి. కెజియారాణి, ప్రోగ్రాం అధికారులు,వాలంటీర్లు 'ఆజాద్ కా అమృత మహోత్సవం ఫ్రీడం రన్ 75' ని పురస్కరించుకుని క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాంను నిర్వహించారు. శనివారం ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ మ్యూజియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేశారు.



## ఐ.సి.ఎస్.ఎస్.ఆర్ ప్రోజెక్ట్ పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ

**26.08.21 (మీడియాసెల్)** ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్ (ఐ.సి.ఎస్.ఎస్.ఆర్) హైదరాబాద్ రీజిన్ మైనర్ ప్రోజెక్టుకు సంబంధించిన పరిశోధన గ్రంథాన్ని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆవిష్కరించారు. బుధవారం విశ్వవిద్యాలయం ఈసీ హాల్ లో పరిశోధన గ్రంథాన్ని వీసీ ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు.రజక, జాలరి, నాయిబ్రాహ్మణ కులాలోని ఆర్థిక మరియు సామాజిక జీవన స్థితిగతులపై ఆదికవి నన్నయ యూనివర్సిటీ అధ్యాపకులు ఈ గ్రంధాన్ని రూపొందించారన్నారు. దీనికి డైరెక్టర్ గా ఆచార్య ఎస్.టేకి, కోడైరెక్టర్లుగా డా.మోటూరి రమేశ్, డా.ఎ.ఎస్.పద్మవల్లి, డా.పి.లక్ష్మీనారాయణ వ్యవహరించారని తెలిపారు. ఐ.సి.ఎస్.ఎస్.ఆర్. హైదరాబాద్ రీజిన్ లక్ష రూపాయల ఆర్థిక సహకారంతో ఈ పరిశోధన గ్రంథాన్ని పూర్తి చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తూర్పుగోదావరి, విజయనగరం, చిత్తూరు జిల్లాల్లో రజక, జాలరి, నాయిబ్రాహ్మణ కులాల ఆర్థిక మరియు సామాజిక జీవన స్థితిగతులపై సమర్థవంతమైన నివేదికను సిద్ధం చేశారని చెప్పారు. ఈ పరిశోధన ద్వారా రజక, జాలరి, నాయిబ్రాహ్మణ వృత్తులకు సంబంధించి ప్రధాన అంశాలను ఈ పుస్తకం ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తున్నారని అన్నారు. దీనిలో ప్రధానంగా కుల వృత్తులలో సాంకేంతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే యంత్రాలను ప్రభుత్వ రాయితీల ద్వారా కల్పించాలని, తద్వారా జీవనోపాధి మెరుగుపడుతుందని తెలియజేశారు. కులవృత్తులకు సంబంధించిన సొసైటీలు, ప్రభుత్వాల నుండి ఆర్థిక సహకారం కావాలన్నారు. కులవృత్తుల జీవన స్థితిగతులపై పలు కీలకాంశాలను ఈ పరిశోధనలో పొందు పరిచారని దీనిని ఐ.సి.ఎస్.ఎస్.ఆర్. కు నివేదించారని తెలియజేశారు. వినూత్న విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కులవృత్తులను అభివృద్ధి చేసే మార్గాలను వీసీ సూచించారు. ఆంధ్ర యూనివర్సిటీలో తన విద్యార్థి వినూత్నంగా రూపొందించిన గ్యాస్ ఇస్త్రీపెట్టి కి మంచి స్పందన వచ్చిందని గుర్తుచేశారు. ఆయా వృత్తులలో నూతన విధానాలను ప్రవేశ పెట్టడం ద్వారా కలిగే ప్రయోజనాలను సూచిం చారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులంతా పరిశోధనలు, ప్రోజెక్టు లపై దృష్టి సారించి సమాజహితానికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, అధ్యాపకులు డా.ఎం.రమేశ్, డా.ఎ.ఎస్.పద్మవల్లి, డా.పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



పరిశోధన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు

# తెలుగు భాషను పరిరక్షించుకుందాం

## తెలుగు, సంస్కృత అకాడమి చైర్ పర్సన్ డా.నందమూరి లక్ష్మీ పార్వతి

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమి చైర్ పర్సన్ గా డాక్టర్ నందమూరి లక్ష్మీ పార్వతి కీలక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన భాషా చైతన్య సదస్సుకు లక్ష్మీ పార్వతి హాజరయ్యారు.**

**(వారితో ఎడిటర్ ముఖాముఖి)**



**మేడమ్ గారు నమస్కారం!**

**తమ బాల్యం, విద్యాభ్యాస విషయాలు తెలియజేయండి**

నేను పచ్చల తాడిపర్రు గ్రామం, పొన్నూరు మండలంలో జన్మించాను. ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ పచ్చల తాడిపర్రు, ఉభయ భాషాప్రవీణ, భావనారాయణ సంస్కృత కళాశాల పొన్నూరులో సాగింది. ఎం.ఏ., నాగార్జున యూనివర్సిటీ, ఎం.ఫిల్, పి.హెచ్.డీ తెలుగు యూనివర్సిటీ హైదరాబాద్ లో చేశాను.

**ఉద్యోగ,పరిశోధన,ప్రచురణ విషయాలు తెలియజేయండి.**

లెక్చరర్ గా కొల్లూరు జూనియర్ కాలేజీ, రఘురామయ్య డిగ్రీ కాలేజీ నర్సరావుపేటలో పని చేశాను. ఎన్టీఆర్ జీవిత చరిత్ర, స్వాతంత్ర్య సంగ్రామంలో సుభాష్ చంద్రబోస్, శ్రమణకం, వైదేహి, అభిజ్ఞ నవలలు, ఎన్.టి.ఆర్.పురాణ పాత్రలు(పి.హెచ్.డి గ్రంథం), వెగులు దారులు, భజగోవిందం వ్యాఖ్య, ఆధ్యాత్మిక గ్రంథాలు, అవనిజం, ఏదో ఒకనాడు (ముద్రణలో), ఆద్యంతాలు కవితా సంపుటి మరియు అనేక రాజకీయ వ్యాసాలు, సాక్షి, వార్త, ఆంధ్రభూమి పేపర్లలో ప్రచురించబడ్డాయి.

**సాహితీ సేవలు గురించి తెలియజేయండి.**

భర్త ఎన్.టి.ఆర్. మరణానంతరం ఎన్.టి.ఆర్. ఎడ్యుకేషనల్ సొసైటీ స్థాపించి అనేక బాలల, సామాజిక సాహిత్య రచనలను ప్రోత్సహించటం, 2006లో ఎన్.టి.ఆర్. విజ్ఞాన ట్రస్టు స్థాపించి ఎన్.టి.ఆర్. జాతీయ సాహితీ అవార్డును కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తింపు పొందిన జాతీయ భాషల్లో ప్రతి సంవత్సరం లక్ష రూపాయల నగదుతో ఒక ప్రముఖునికి సన్మానం చేస్తున్నాం. ఈ ట్రస్టు ద్వారా అనేకమంది జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతల్ని సన్మానించటం జరిగింది. ఇది మే 28 ఎన్.టి.ఆర్. జన్మదినాన జరుగుతుంది.

**తెలుగు, సంస్కృత అకాడమి కార్యక్రమాలు, ప్రణాళికలు.**

తెలుగు, సంస్కృత అకాడమిని మంచి ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి గారు ఏర్పాటు చేశారు. దాని ఉద్దేశాలను సాకారం చేసే విధంగా అకాడమిని మేము ముందుకు తీసుకువెళ్తాం. ఈ ఏడాది అకాడమి ద్వారా ఇంటర్ పుస్తకాలను ప్రచురించాం. త్వరలో అకాడమికి నిధులు సమకూర్చి భాషాభివృద్ధికి మరింత పాటుపడతాం.

**భాషా చైతన్య సదస్సుల ముఖ్య ఉద్దేశం.**

మాతృభాషను మర్చిపోకూడదు, మన ఉనికిని, మన ఆత్మ గౌరవాన్ని కాపాడేది భాషే. ప్రజలను భాషా చైతన్యవంతులుగా చేయటానికి తెలుగు,సంస్కృత అకాడమి తరపున భాషా చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నాం. ఆయా విశ్వవిద్యాలయాల్లో భాషా చైతన్య సదస్సులు నిర్వహించి తల్లీబిడ్డల వంటి సంస్కృతి, తెలుగు భాషల మధ్య సంబంధాలపై చర్చలు నిర్వహిస్తున్నాం. భాష మూలాలపై అనేక కీలక అంశాలు భాషా పండితులు,కవులు,మేథావులు ఈ చర్చల ద్వారా వెలుగులోనికి తీసుకువస్తున్నారు.

**ఎన్టీఆర్ మానస పుత్రిక - తెలుగు విశ్వవిద్యాలయం పరిస్థితి ఏమిటి.**

తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహనీయులు నా భర్త స్వర్గీయ నందమూరి తారక రామారావుగారు. ఆయన తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేసి తెలుగు విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మూడు హైదరాబాద్, రాజమహేంద్రవరం, శ్రీశైలం పీఠాలను ప్రారంభించి ఎంతో అభివృద్ధి చేశారు. తరువాత కాలంలో తెలుగు విశ్వవిద్యాలయం దయనీయ స్థితికి మారిపోయింది. దీనిని సి.ఎం. జగన్మోహనరెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్తాం. త్వరలో తెలుగు విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తాం.

**విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు అకాడమి సహకారం.**

విశ్వవిద్యాలయాలు, కళాశాలలు అకాడమితో కలిసి భాష, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అవకాశం ఇస్తున్నాం. భాషాభివృద్ధికి ఎవరు ఏ కార్యక్రమం చేసిన అకాడమి వారితో నిలబడుతుంది. అకాడమి బ్యానర్ తో అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. నన్నయ విశ్వవిద్యాలయం - అకాడమి భాషాభివృద్ధిలో భాగంగా తెలుగు, సంస్కృత అకాడమి మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా పీజీ డిప్లమా సంస్కృతం కోర్సును ఏర్పాటు చేసేందుకు వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుగారు సూచించారు. అకడమితో కలిసి భాషాభివృద్ధికి పాటుపడడానికి విశ్వవిద్యాలయాలు ముందుకు రావడం హర్షణీయం. త్వరలో దానిపై నిర్ణయం తీసుకొని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తాం. అలాగే అకాడమి ఆర్థికంగా బలోపేతం అయిన తరువాత విశ్వవిద్యాలయాలతో కలిసి భాషా, సాహిత్యాభివృద్ధికి సంబంధించిన ప్రోజెక్టుల నిర్వహిస్తాం.

**యువతకు మీరిచ్చే సూచన**

ఏ మీడియంలో చదువుకున్నా మాతృభాషను మరచిపోవద్దు. తల్లిదండ్రులు మాతృభాషలో వ్రాయడం, చదవం పిల్లలకు అలవాటు చేసి,భాషా పరిరక్షణకు సహకరించాలి. యువతరం ఏ దేశానికి వెళ్ళిన తెలుగువాళ్ళం అని గర్వంగా చెప్పుకోవాలి. తెలుగు భాష వలననే మన ఉనికి, మన గౌరవం ఇనుమడిస్తాయి.

మంచిదండి. ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమి చైర్ పర్సన్ గా తమరు అందిస్తున్న సేవలు మరిన్ని ఫలితాలను ఇవ్వాలని, యువత భాష, సాహిత్యం, విద్య, ఉద్యోగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాం. అకాడమి సేవలకు నన్నయవాణి తరుపున కృతజ్ఞతలు.

**నమస్కారం మేడమ్ గారు.**

**ధన్యవాదాలండి.**

సంతోషం. అకాడమీ భాషా చైతన్య సదస్సుకు నన్నయ విశ్వవిద్యాలయం వేదిక అయినందుకు,వి.సి.గారి ప్రోత్సాహం ఆనందాన్ని కలిగించింది.

## కోస్టల్ ఫ్రాంటియర్స్ - మాంగ్రోవ్స్ పై వెబినార్

### బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ జగన్నాథరావు

**27.08.21 (మీడియాసెల్)** సెప్టెంబర్ 7వ తేదిన కోస్టల్ ఫ్రాంటియర్స్ - మాంగ్రోవ్స్ పై వెబినార్ సిరిస్ నిర్వహిస్తున్నారని అందరూ దీనిని సద్వినియోంగం చేసుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో గురువారం వెబినార్ కు సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. డిపార్టమెంట్ ఆఫ్ జూవాలజీ అండ్ ఆక్వాకల్చర్ మరియు ఆపర్టునిటీస్ ఫర్ కెపాసిటి బిల్డింగ్ అండ్ ఇంటర్నేషనల్ నెట్ వర్కింగ్ సంయుక్త ఆధ్వర్యంలో 7వ తేది ఉదయం 10 గంటలకు వెబినార్ నిర్వహిస్తారని చెప్పారు. ఈ వెబినార్ కు కోర్డినేటర్ గా సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, కో.కన్వీనర్లుగా డా.ఐ.జె.ఎన్.పద్మవతి, డా.డి.శ్రీధర్ వ్యవహరిస్తున్నారని అన్నారు. వక్తలుగా అంతర్జాతీయ నిపుణులు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ అండ్ ఎన్విరాన్మెంట్ యూనివర్సిటీ మలేషియా డా. బి.సత్య నారాయణ, బోటనీ విభాగం రుహూనా విశ్వవిద్యాలయం శ్రీలంక, సీనియర్ అధ్యాపకులు డా.కె.ఎ.సునంద హాజరై ఉపన్యసిస్తారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డా.వి.విజయ నిర్మల, డా.డి.కళ్యాణి, అధికారులు, విభాగాధ్యాపకులు పాల్గొన్నారు.




వెబినార్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు

## క్రీడాభివృద్ధికి అందరూ సహకరించాలి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**29.08.21 (మీడియాసెల్)** భారతదేశంలో ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు వారికి సహకారాన్ని అందించి క్రీడాభివృద్ధికి పాటుపడాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నేషనల్ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్ 2021ను ఆన్లైన్ లో నిర్వహించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.వి.ఎం.యు.ఫణీంద్ర కన్వీనర్ గా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ధ్యాన్ చంద్ తన ప్రతిభతో హిట్లర్ ను సహితం ఆశ్చర్య పరిచేలా హాకీలో రాణించారని కొనియాడుతూ నివాళులర్పించారు. భారతదేశంలో ఎంతో మంది ప్రతిభావంతులు ఉన్నారని వారికి సరైన అవకాశాలు కల్పిస్తే నీరజ్ చోప్రా లాగా దేశానికి బంగారు పతకాలను తీసుకువస్తారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారత దేశానికి గుర్తింపు తీసుకురావడానికి క్రీడలే సరైన మార్గమని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉండాలన్నారు. క్రీడలకు అవసరమైన వసతులు వనరులు సమకూర్చి నైపుణ్యమున్న క్రీడాకారులను ఎంపిక చేసి ఒలింపిక్స్ కు పంపాలన్నారు. క్రీడాకారులకు ఉద్యోగ ఉపాధి భరోసా కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. దేశంలో క్రీడాభివృద్ధికి ప్రజలు, ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు సమష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. రిసోర్స్ పర్సన్స్ ఆంధ్రా యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ ఆచార్య ఎన్. విజయ్ మోహన్ మాట్లాడుతూ యూనివర్శిటీలో, కళాశాలలో క్రీడా వసతులను సమకూర్చుడం ద్వారా క్రీడాభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. ప్రముఖ క్రీడా పరిశోధకులు, టేబుల్ టెన్నిస్ ప్లేయర్ సుంకర నాగేంద్ర కిషోర్ మాట్లాడుతూ స్పోర్ట్స్ సైకాలజీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ డా.కె.సుబ్బారావు, డా.కె.రమణేశ్వరి, కన్వీనర్ డా. వి.వి.ఎం.యు.ఫణీంద్ర, కో కన్వీనర్లు డా.కె.బాల సత్యనారాయణ, వి.ఎస్.దేవానంద్, ఎం.వి.ఎస్.ఎస్. మూర్తి, డా. సిహెచ్.వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు